క్లుప్తంగా

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



రెడ్డిగూడెం: మండలం కేంద్రమైన రెడ్డిగూడెం గ్రామంలో కాపుల బజారు నందు వేం చేసి ఉన్న అంకమ్మ తల్లి 7వ వార్షిక మహోత్సవాలు గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ అర్చకుడు చింతలపాటి పవన్‌కుమార్ శాస్త్రి ఆధ్వర్యంలో విశేష అభిషేకాలు, పూజలు, రాజశ్యామల హోమం, మహా పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించారు. సమీప గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయం భక్తులతో కిటకిటలాడింది. అశేష భక్త జన సందోహం నడుమ వేద పండితుల మంత్రోచ్ఛారణలతో వార్షిక మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాదాన్ని అందజేశారు.

కొండపల్లిలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లిలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర గురువారం జరిగింది. అధికారులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి, పథకాలు వివరించారు. ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డు, మాతృ వందనం, పీఎం ఉజ్వల యోజన, సమ్మాన్ కిసాన్ యోజన తదితర పథకాలు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు, మున్సిపాలిటీ అధికారులు పాల్గొన్నారు.

3న యాదవ సంఘ ఆత్మీయ సమావేశం

తిరువూరు: తిరువూరు నియోజకవర్గ యాదవ సంఘ ఆత్మీయ పరిచయ సమావేశం మార్చి 3వ తేదీన తిరువూరులో నిర్వహిస్తున్నట్లు సంఘ అధ్యక్షుడు యరదేశి రామారావు తెలిపారు. గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సమావేశానికి వైఎస్సార్ సీపీ విజయవాడ పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జి కేశినేని శ్రీనివాస్(నాని), తిరువూరు నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు, విజయవాడ నగర మాజీ డెప్యూటీ మేయర్ గోగుల వెంకటరమణారావు, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సుధారాణిలను ఆహ్వానించామన్నారు. తిరువూరు బైపాస్ రోడ్డులోని వీ కన్వెన్షన్ హాల్‌లో సాయంత్రం 5 గంటలకు జరిగే ఆత్మీయ సమావేశానికి యాదవ సంఘ సభ్యులు విచ్చేయాలని కోరారు. సంఘ సభ్యులు కాలసాని చెన్నారావు, గుమ్మా పాపారావు, చిమటా రామకృష్ణ, కోమటి చెన్నారావు, పాలం గోపాలరావు, దొంగల నరసింహారావు మల్లేశ్వరరావు, జి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

ముగిసిన ఎన్ఎస్ఎస్ సేవా శిబిరం

నూజివీడు: మండలంలోని మిట్టగూడెంలో పట్టణంలోని ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో వారం రోజులుగా నిర్వహిస్తున్న సేవా శిబిరం గురువారంతో ముగిసింది. సర్పంచ్ నరసింహారావు మాట్లాడుతూ.. విద్యార్థులు వారం రోజుల పాటు గ్రామంలో అనేక కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు విద్య, బాల్య వివాహాలు, పరిశుభ్రత తదితర అంశాలపై గ్రామస్తులను చైతన్యపరిచారన్నారు. దోమల వల్ల కలిగే నష్టాలను వివరించి అవగాహన కల్పించారని, మొక్కలు పెంచడం వల్ల కలిగే లాభాలను, పర్యావరణ పరిరక్షణ తదితర అంశాలను వివరించారన్నారు. ప్రిన్సిపాల్ ప్రత్తిపాటి విజయలక్ష్మి, నాయకులు సీతారామయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

మైనర్లకు వాహనాలిస్తే తల్లిదండ్రులే బాధ్యులు



తిరువూరు: మైనార్లకు ద్విచక్ర వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని తిరువూరు ఎస్ఐ సత్యనారాయణ హెచ్చరించారు. తిరువూరు పట్టణంలో గురువారం పలు కూడళ్ల వద్ద అతి వేగంతో వాహనాలు నడుపుతున్న యువకులను పోలీసులు అదుపులోకి తీసుకుని కౌన్సెలింగ్ ఇచ్చారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా, వాహనాలను నిర్లక్ష్యంగా నడిపే వారిపై, మైనర్లపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ముగిసిన సిలువగిరి మహోత్సవాలు

నందిగామ: క్రైస్తవులు ఇతరులకు మార్గదర్శకంగా ఉండాలని విజయవాడ మేత్రాసన పీఠాధిపతి రెవరెండ్ డాక్టర్ తెలగతోటి జోసఫ్ రాజారావు సూచించారు. పట్టణ శివారుల్లోని పల్లగిరి కొండపైగల సిలువగిరి మహోత్సవాలు గురువారంతో ముగిశాయి. జోసఫ్ రాజారావు సమష్టి దివ్యబలి పూజ సమర్పించారు. క్రైస్తవం మతం కాదని, పరలోక రాజ్యానికి చేర్చే మార్గమని బోధించారు. క్రీస్తును మంచి మనసుతో ఆరాధించాలన్నారు. విచారణ గురువు రెవరెండ్ ఎం.ఫిలోమెన్ రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన మహోత్సవాలకు పెద్దసంఖ్యలో ప్రజలు హాజరయ్యారు.

ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం





ఇంటర్ పరీక్షలకు సిద్ధమైన మడుపల్లి తాతయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల ; మడుపల్లి తాతయ్య ప్రభుత్వ కళాశాలలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు

నేటి నుంచి ప్రథమ సంవత్సర పరీక్షలు

నూజివీడు: శుక్రవారం నుంచి నిర్వహిస్తున్న ఇంటర్మీడియెట్ పరీక్షలకు పట్టణంలోని పరీక్షా కేంద్రాల్లో సర్వం సిద్ధం చేశారు. ఈ పరీక్షల నిర్వహణకు గాను పట్టణంలో మడుపల్లి తాతయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల, శ్రీ శారదా జూనియర్ కళాశాల, సెయింట్‌ఆన్స్ జూనియర్ కళాశాల, శ్రీ సిద్ధార్థ జూనియర్ కళాశాల, వాగ్దేవి జూనియర్ కళాశాల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ పరీక్షలలో ఇంటర్ ప్రథమ సంవత్సరానికి 1,621 మంది, ద్వితీయ సంవత్సరానికి 1,450 మంది పరీక్షలు రాయనున్నారు. ప్రశ్నాపత్రాలు ఇప్పటికే పోలీస్ స్టేషన్లలోని స్టాకు పాయింట్‌కు చేరుకున్నాయి. పరీక్షా కేంద్రాలకు సంబంధించి చీఫ్ సూపరింటెండెంట్‌లను, డిపార్ట్‌మెంట్ అధికారులను, ఇన్విజిలేటర్లను నియమించడం, వారికి శిక్షణ కూడా పూర్తయ్యింది. పరీక్ష ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగుతుంది. విద్యార్థులు పరీక్షా కేంద్రం వద్దకు 8.30 గంటల కల్లా చేరుకోవాలి. 9 గంటల తరువాత పరీక్షా కేంద్రంలోకి అనుమతించమని ప్రశ్నాపత్రాల కస్టోడియన్ స్వర్ణలత తెలిపారు. ఈ దఫా అన్ని పరీక్షా కేంద్రాల్లోని ప్రతి రూమ్‌లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. పరీక్షలు జరుగుతున్న తీరును జిల్లా ఉన్నతాధికారులు సైతం ఎప్పటికప్పుడు పరిశీలించేలా ఏర్పాట్లు చేశారు. ఇన్విజిలేటర్లు, చీఫ్ సూపరింటెండెంట్‌లు సైతం తమ ఫోన్‌లను తీసుకురావడానికి అనుమతి లేదు. మడుపల్లి తాతయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల చీఫ్ సూపరింటెండెంట్‌గా దుర్గాప్రసాద్, శ్రీ శారద కళాశాలకు టి.విజయ, సెయింట్ ఆన్స్ జూనియర్ కళాశాలకు ఉమాదేవి, వాగ్దేవి జూనియర్ కళాశాలకు సీహెచ్ జాన్, సిద్ధార్థ జూనియర్ కళాశాలకు చంద్రశేఖర్‌శర్మ నియమితులయ్యారు. పరీక్షా కేంద్రాల వద్ద 144వ సెక్షన్ విధించడంతో పాటు పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు. అలాగే ఏఎన్ఎంలను నియమించడంతో పాటు మంచినీటి వసతిని, ఇతర సదుపాయాలను ఏర్పాటు చేశారు.

మైలవరం: ఇంటర్మీడియెట్ పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభమవుతున్నాయని మైలవరం వీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల చీఫ్ సూపరింటెండెంట్ ఎం.రాధాకృష్ణ శుక్రవారం తెలిపారు. మైలవరం వీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల, లిటిల్ ఫ్లవర్ జూనియర్ కళాశాల, ఎస్వీఆర్‌ఎన్ఆర్ జూనియర్ కళాశాలల్లో పరీక్షలు జరుగనున్నాయన్నారు. పరీక్షా కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేశామని చెప్పారు. శుక్రవారం ఉదయం 8.45 గంటలకు పరీక్షా కేంద్రాలకు విద్యార్థులు హాజరుకావాలన్నారు. ఒక్క నిమిషం ఆలస్యమైన అనుమతి లేదన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం 134 మంది, ఒకేషనల్ 97 మంది, సెకండియర్ జనరల్ 143 మంది, ఒకేషనల్ 98 మంది, లిటిల్ ఫ్లవర్ జూనియర్ కళాశాలలో ఫస్ట్ ఇయర్ 136 మంది, సెకండియర్ 108 మంది, ఎస్వీఆర్జీఎన్నార్ కళాశాలలో ఫస్ట్ ఇయర్ 146 మంది, సెకండియర్ 150 మంది విద్యార్థులు హాజరవుతారన్నారు. లిటిల్ ఫ్లవర్ జూనియర్ కళాశాల, ఎస్వీఆర్జీఎన్నార్ కళాశాల చీఫ్ సూపరింటెండెంట్‌లు సుభాషిణి, బుచ్చిబాబులు పాల్గొన్నారు.

కంభంపాడులో పరీక్షా కేంద్రం ఏర్పాటు

ఏ.కొండూరు: శుక్రవారం నుంచి జరిగే ఇంటర్మీడియెట్ పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని చీఫ్ సూపరింటెండెంట్ వి.నూతనప్రసాద్ గురువారం తెలిపారు. మండలంలోని కంభంపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రంలో వికాస్, కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం, కృష్ణారావుపాలెం గురుకుల కళాశాలలకు చెందిన ఫస్ట్ ఇయర్ విద్యార్థులు 165 మంది పరీక్షలకు హాజరవుతారన్నారు. పరీక్షా కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని పరీక్షలు పకడ్బందీగా నిర్వహిస్తామని చెప్పారు. ఇన్విజిలేటర్లు ఏడుగురు, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్ ఒకరు పర్యవేక్షిస్తుంటారన్నారు. విద్యార్థులందరూ పరీక్షా కేంద్రానికి 9 గంటల లోపు హాజరు కావాలని చీఫ్ సూపరింటెండెంట్ చెప్పారు.

‘పల్స్ పోలియో’ను విజయవంతం చేయాలి

- 3న పల్స్ పోలియో
- ఆర్డీఓ వై.భవానిశంకరి

నూజివీడు: డివిజన్ పరిధిలో ఈ నెల 3వ తేదీన నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు వైద్య, ఐసీడీఎస్, విద్య, రెవెన్యూ, పంచాయతీరాజ్ అధికారులందరూ సమన్వయంతో పని చేయాలని ఆర్డీఓ వై.భవానిశంకరి ఆదేశించారు. పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం డివిజన్‌లోని పీహెచ్‌సీల వైద్యాధికారులు, ఎంపీడీఓలు, తహసీల్దార్లతో పల్స్ పోలియో నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ.. సున్నా నుంచి ఐదేళ్ల లోపు పిల్లలకు పోలియో చుక్కల మందును వేయించాలన్నారు. దీనికి గాను ప్రజలందరికీ తెలిసేలా ర్యాలీలు నిర్వహించడంతో పాటు ప్రతి గ్రామంలోనూ టాంటాం వేయించాలని ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాలు, పీహెచ్‌సీలు, విలేజ్ క్లినిక్‌లు, బస్టాండ్ తదితర ప్రాంతాల్లో పోలియో చుక్కలను వేసేందుకు కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు.

డివిజన్‌లో 36,254 మంది చిన్నారులు

ఇన్‌చార్జి డెప్యూటీ డీఎంహెచ్‌ఓ జాస్తి జగన్‌మోహన్ రావు మాట్లాడుతూ.. డివిజన్‌లో 36,254 మంది ఐదేళ్ల లోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. దీనికి గాను 352 కేంద్రాలను, 34 రూట్‌లను, 34 మంది రూట్ సూపర్‌వైజర్లను, 760 టీమ్‌లను ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటికే సిబ్బందికి పలు మార్లు పోలియో చుక్కలను వేయడంపై శిక్షణ ఇచ్చామన్నారు. దీనిని విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ఈ సందర్భంగా పల్స్ పోలియో వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో డీఎల్‌పీఓ సుందరి, మున్సిపల్ కమిషనర్ ఆర్.వెంకటరామిరెడ్డి, వైద్యులు నరేంద్రకృష్ణ, సౌమ్య, సాయి సుధ, సురుచి, పలు మండలాల ఎంపీడీఓలు, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

పోలియో నిర్మూలనకు సహకరించాలి



పల్స్ పోలియో వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆర్డీఓ భవానిశంకరి తదితరులు



చాట్రాయిలో వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎంపీడీఓ కుమారి

చాట్రాయి: పోలియో మహమ్మారిని నిర్మూలించేందుకు ప్రజలు సహకరించాలని ఎంపీడీఓ మంగా కుమారి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మార్చి 3వ తేదీన నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమంపై గురువారం పలు శాఖల అధికారులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. మండలంలో ఐదేళ్ల లోపు 3,527 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తామన్నారు. మండలంలో సిబ్బందిని 64 బృందాలుగా ఏర్పాటు చేశామని, ఆ రోజున ప్రతి ఇంటికి వెళ్లి పోలియో చుక్కలు వేయించి విజయవంతం చేయాలని ఆమె కోరారు. అనంతరం పోలియో చుక్కల వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యుడు శ్రీనివాసరెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గాయత్రీ, పీహెచ్‌సీ సీహెచ్‌ఓ రమణ తదితరులు పాల్గొన్నారు.

నీటి కుంటలతో అధిక దిగుబడులు



కేతనకొండలో నీటికుంటను పరిశీలిస్తున్న ఏపీఓ మాధవరెడ్డి తదితరులు

కేతనకొండ(ఇబ్రహీంపట్నం): వ్యవసాయ భూముల్లో నీటి కుంటలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా పంట సాగులో అధిక దిగుబడులు సాధించవచ్చని ఏపీఓ మాధవరెడ్డి తెలిపారు. కేతనకొండలో ప్రభుత్వ భూమిలో ఏర్పాటు చేసిన ఫారమ్ పాండ్(నీటి కుంట)ను గురువారం ఆయన పరిశీలించారు. గతేడాది జూలైలో వర్షం నీటితో నిండిన నీటి కుంటలో ఇప్పటి వరకు నీరు నిలిచి ఉందన్నారు. వేసవిలో సైతం పశువులు, పశువుల కాపర్లు, అడవి వన్యప్రాణులు నీటితో సేదతీరుతున్నాయని ఆయన తెలిపారు. రైతులు తమ వ్యవసాయ పొలాల్లో నీటికుంటలు తీయించుకుంటే సైజును బట్టి రూ.60 వేల నుంచి రూ.5 లక్షలు వరకు మంజూరు చేస్తామన్నారు. ఆసక్తి గల రైతులు, గ్రామ సచివాలయం, మండల ఉపాధి హామీ కార్యాలయంలో సంప్రదించాలని ఏపీఓ కోరారు.

తాగునీటి సరఫరాకు ప్రత్యేక ఏర్పాట్లు



తిరువూరు కౌన్సిల్ సమావేశంలో చర్చిస్తున్న కౌన్సిలర్లు

తిరువూరు: వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా ముందస్తు ఏర్పాట్లు చేసినట్లు తిరువూరు నగర పంచాయతీ చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి తెలిపారు. నగర పంచాయతీ కౌన్సిల్ అత్యవసర సమావేశం చైర్‌పర్సన్ అధ్యక్షతన గురువారం జరిగింది. ఎంపీ ల్యాడ్స్ నిధుల నుంచి మంజూరైన 3 ట్రాక్టర్లు, 5 వాటర్ ట్యాంకర్లతో తాత్కాలిక ప్రాతిపదికన డ్రైవర్లను నియమించి అన్ని వార్డులకూ తాగునీరు సరఫరా చేస్తున్నామన్నారు. ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు రూ.21 లక్షలతో చేపట్టాల్సిన పనులపై కౌన్సిలర్ల ప్రతిపాదనలను ఆమోదించారు. వైస్ చైర్‌పర్సన్లు విజయలక్ష్మి, వెంకటేశ్వరి, మున్సిపల్ కమిషనర్ లోవరాజు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు



తిరువూరులో టిఫిన్ సెంటర్‌లో గారె వేస్తున్న స్వామిదాసు

తిరువూరు: తిరువూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు మార్నింగ్ వాక్ కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. ఉదయం 6 గంటల నుంచి తిరువూరు నగర పంచాయతీలోని పలు వార్డుల్లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందిన కుటుంబాలు మళ్లీ వైఎస్సార్ సీపీకి మద్దతుగా నిలవాలని స్వామిదాసు విజ్ఞప్తి చేశారు. అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందజేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో నగర పంచాయతీ కౌన్సిలర్లు పరసా శ్రీనివాసరావు, తంగిరాల వెంకటరెడ్డి, మోదుగు ప్రసాద్, నాయకులు షేక్ జాకీర్, తిరుమలశెట్టి వేణుబాబు, మంచాల మల్లేశ్వరరావు, యరదేశి రామారావు, గజ్జల సీతారామారావు, శ్రీనాథ్, గుంటూరు మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం చాటిన సీఐ దుర్గాప్రసాద్

పాయకాపురం(విజయవాడరూరల్): రోడ్డు ప్రమాదంలో గాయపడిన ప్రైవేట్ స్కూల్ టీచర్‌ను తన జీపులో ఆస్పత్రికి తరలించి నున్న సీఐ కె.దుర్గాప్రసాద్ మానవత్వాన్ని చాటుకున్నారు. కండ్రికలోని కేర్ అండ్ షేర్ స్కూల్ ఉపాధ్యాయురాలు బట్ట రజిని గురువారం తన విధులు ముగించుకుని తన స్కూటీపై ఇంటికి తిరిగి వెళ్తున్నారు. ఈ క్రమంలో స్థానిక ప్రకాష్‌నగర్ సెంటర్‌లో ఏపీ03 టిజే 0237 నంబరు గల వ్యాన్ వేగంగా వచ్చిన ఆమెను ఢీ కొట్టింది. బాధితురాలి కాలుపై నుంచి వ్యాన్ వెళ్లడంతో రోడ్డపై ఆమె రక్తమోడింది. అదే సమయంలో విధుల నిమిత్తం అటుగా వెళ్తున్న సీఐ దుర్గాప్రసాద్ ఈ విషయం గమనించి క్షతగాత్రురాలిని సిబ్బంది సాయంతో తన జీపులో ఎక్కించుకుని హుటాహుటిన విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన వ్యాన్‌ను స్టేషన్‌కు తరలించి డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే స్పందించి మానవతా దృక్పథంతో బాధితురాలిని ఆదుకున్న సీఐ దుర్గాప్రసాద్‌ను స్థానికులు అభినందించారు.

ఎన్ఆర్ఐ కళాశాల ఆధ్వర్యంలో మెడికల్ క్యాంప్



కనసానపల్లిలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

ఆగిరిపల్లి: మండలంలోని కనసానపల్లిలో గురువారం ఎన్ఆర్ఐ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థుల ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఆంధ్ర హాస్పిటల్ డాక్టర్ కామినేని అచ్యుత్‌బాబు వారి బృందంతో కలిసి గ్రామస్తులకు, వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ రాగ సాయి, కో ఆర్డినేటర్ శ్రీనివాస్, శివన్నారాయణ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంగ్లిష్ సబ్జెక్టుపై విద్యార్థులకు అవగాహన



మైలవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులతో అధ్యాపకురాలు సుభాషిణి

మైలవరం: మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుతున్న విద్యార్థులు నందిగామ కేవీఆర్ కళాశాలలో జరిగిన స్టూడెంట్ ఎక్స్చేంజ్ ప్రోగ్రామ్‌లో పాల్గొన్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి తెలిపారు. మైలవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం నిర్వహించిన సమావేశంలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. తమ కళాశాలకు చెందిన విద్యార్థులు నందిగామ కళాశాలలో నిర్వహిస్తున్న ఇంగ్లిష్ సబ్జెక్టు క్లాసుల్లో పాల్గొంటారని అలాగే నందిగామ కళాశాల విద్యార్థులు మైలవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగే తరగతులకు హాజరవుతారన్నారు. దీని వలన విద్యార్థులకు సబ్జెక్టుపై మరింత అవగాహన పెరుగుతుందన్నారు. ఇంగ్లిష్ డిపార్టుమెంట్‌తో రెండు కళాశాలల యాజమాన్యం అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నాయని చెప్పారు. విద్యార్థులతో పాటు ఇంగ్లిష్ అధ్యాపకురాలు బి.సుభాషిణి పాల్గొన్నారన్నారు. కేవీఆర్ కళాశాల ప్రిన్సిపాల్ రాయప్ప మాట్లాడుతూ.. ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటాయన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ రవి విద్యార్థులను అభినందించారు.

మస్టర్‌లో ఉపాధి కూలీల సంతకాలు తప్పనిసరి



వలసపల్లిలో హాజరు తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ పద్మావతిదేవి

ముసునూరు: ఉపాధి హామీ కూలీలు మస్టర్ రిజిస్టర్‌లో తప్పనిసరిగా సంతకాలు చేయాలని ఎంపీడీఓ సీహెచ్ పద్మావతీదేవి సూచించారు. గుళ్లపూడి, వలసపల్లి గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను గురువారం ఆమె పరిశీలించి, ఉపాధి మేట్లు, కూలీల హాజరును తనిఖీ చేశారు. రెండు గ్రామాల్లో జరుగుతున్న ఫీడర్ ఛానల్స్, సప్లయి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మస్టర్ రిజిస్టర్‌లో దిద్దుళ్లు, కొట్టివేతలు లేకుండా కూలీలతో సంతకాలు చేయించాలని ఉపాధిహామీ సిబ్బందికి సూచించారు. కార్యక్రమాల్లో ఏపీఓ రోజ్‌లీల, జయప్రసాద్, ఉపాధి హామీ మేట్లు, కూలీలు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి

ముసునూరు: పేకాట శిబిరంపై దాడి చేసి ఇద్దరు వ్యక్తులను అదుపులోనికి తీసుకున్నట్లు ఎస్ఐ పి.వాసు తెలిపారు. చింతలవల్లిలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై గురువారం పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని, వారి నుంచి రూ.400 నగదు స్వాధీనం చేసుకున్నామని, నిందితులను శుక్రవారం నూజివీడు కోర్టుకు తరలిస్తామన్నారు.

పరస్పర దాడులు.. కేసుల నమోదు

ముసునూరు: పరస్పర దాడులకు పాల్పడిన ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదైనట్లు ఎస్ఐ పి.వాసు గురువారం తెలిపారు. మండలంలోని కాట్రేనిపాడుకు చెందిన పేరిచర్ల రంగారావు మరో ఇద్దరు వ్యక్తులు కలిసి పేరిచర్ల ఆంజనేయులును కర్రతో కొట్టగా, గాయాలపాలై నూజివీడు ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. అలాగే పేరిచర్ల ఆంజనేయులు, అతని సహచరులు మరో ఇద్దరు కలిసి పేరిచర్ల రంగారావును, అతని భార్యను దూషించి, అవమానకరంగా, కొట్టడంతో వారు నూజివీడు ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆస్పత్రి నుంచి అందిన సమాచారంతో ఇరువర్గాల ఫిర్యాదులపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్ఐ చెప్పారు.

ఓటు హక్కును వినియోగించుకోండి



ఎర్రమాడులో అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ సత్యనారాయణ

ఎర్రమాడు(తిరువూరురూరల్): రానున్న ఎన్నికల్లో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని తిరువూరు పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ కోరారు. మండలంలోని ఎర్రమాడులో గురువారం ఈవీఎంల వినియోగంపై గ్రామస్తులకు ఎన్నికల అధికారులు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడినా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలింగ్ కేంద్రాల వద్ద నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలని సూచించారు.

పదవీ విరమణ ఆత్మీయ సత్కారం



అరుణకుమారిని సత్కరిస్తున్న ఎంఈఓలు పుష్పలత, శ్యామ్‌బాబు

ఇబ్రహీంపట్నం: ఖాజీమాన్యం ఏపీ మోడల్ పాఠశాల ఉపాధ్యాయురాలు నల్లమోతు అరుణకుమారి పదవీ విరమణ పొందారు. ఈసందర్భంగా గురువారం జరిగిన అభినందన కార్యక్రమంలో ఎంఈఓ సీహెచ్ పుష్పలత, ఎంఈవో-2 శ్యామ్‌బాబు అరుణ కుమారి, యోబు దంపతులను ఘనంగా సత్కరించారు. విధి నిర్వహణలో నైతిక విలువలతో కూడిన విద్యా బోధనతో ఎందరినో ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దారని వారు కొనియాడారు. క్రమశిక్షణ, అంకితభావంతో తోటి ఉపాధ్యాయులకు ఆదర్శప్రాయులుగా నిలిచారని కొనియాడారు. కార్యక్రమంలో సీఆర్పీ డి.నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు, సిబ్బంది వారిని అభినందించారు.

ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

నరసింహారావుపాలెం(వీరులపాడు): మండలంలోని నరసింహారావుపాలెంలోని అగస్త్యపీఠంలో శ్రీలలితాదేవి అమ్మవారి ఆలయ నిర్మాణానికి గురువారం శంకుస్థాపన చేశారు. పీఠాధిపతి సుగుణానందస్వామీజీ, వేదపండితులు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. 108 యజ్ఞ కుండాలు ఏర్పాటు చేసి 432 మంది దంపతులు యజ్ఞంలో పాల్గొన్నారు. కార్యక్రమానికి ఎమ్మెల్సీ మొండితోక అరుణకుమార్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సర్పంచి బొమ్మిశెట్టి దుర్గాదేవి, జెడ్పీటీసీ సభ్యురాలు అమర్లపూడి కీర్తిసౌజన్య, కంచికచర్ల మార్కెట్‌యార్డు చైర్మన్ బొమ్మిశెట్టి భాస్కరరావు, ఉపసర్పంచి పుసులేటి సాయి, ఎంపీటీసీ శీలం రమణారెడ్డి, పచ్చల కోటేశ్వరరావు, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వేడుకగా విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం



నరసాపురం(విస్సన్నపేట): మండలంలోని నరసాపురం గ్రామంలో దాతలు, భక్తుల సహకారంతో నూతనంగా నిర్మించిన దేవస్థానంలో విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం గురువారం వైభవంగా నిర్వహించారు. సూర్య, లక్ష్మీనారాయణ, దశావతార, అష్టలక్ష్మి, జీవధ్వజ, గ్రామ నాభిశిల, ముత్యాలమ్మ, శివలింగ, నవగ్రహ విగ్రహాలను ప్రతిష్ఠించారు. అనంతరం అన్నసమారాధన జరిపారు. విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా ముగిసిన తిరునాళ్ల

తిరువూరు: తిరువూరు తిరునాళ్ల బుధవారం రాత్రితో వైభవంగా ముగిసింది. తిరువూరులో వేం చేసి ఉన్న శ్రీవేంకటాచలస్వామి ఆలయంలో వారం రోజులుగా తిరునాళ్ల నిర్వహిస్తున్నారు. తిరుకల్యాణోత్సవాల సందర్భంగా చివరి రోజు స్వామివారి పవళింపు సేవతో కార్యక్రమాలు ముగిశాయి. తిరునాళ్లతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది.

నెమలి బ్రహ్మోత్సవ ఏర్పాట్లపై 5న సమావేశం

తిరువూరు: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన నెమలి వేణుగోపాలస్వామి దేవస్థానంలో మార్చి 23వ తేదీ నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్న నేపథ్యంలో ఏర్పాట్లపై మార్చి 5వ తేదీన సమావేశం జరపనున్నట్లు తిరువూరు రెవెన్యూ డివిజనల్ అధికారి మాధవి గురువారం తెలిపారు. తెలంగాణ, ఏపీ రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చేపట్టే ఏర్పాట్లపై సమీక్షిస్తామన్నారు. 5వ తేదీ ఉదయం 10.30 గంటలకు జరిగే సమావేశానికి రెవెన్యూ, పోలీస్, రవాణా, పంచాయతీరాజ్ తదితర శాఖల అధికారులు హాజరు కావాలని కోరారు.